విద్యాదాత, గ్రంథాలయ ఉద్యమనేత
గాంధేయవాది, సంఘ సంస్కర్త

# గోనుగుంట్ల నాగేశ్వరరావు



# బాల్య జీవితం

కృష్ణాజిల్లాలోని జగ్గయ్యపేట అతి ప్రాచీన నగరాలలో ఒకటి. ఇక్కడ క్రీస్తుశకం రెండవ శతాబ్దంలోనే బౌద్ధ స్థూపం ఏర్పాటైంది. క్రీ.శ. 260 సంవత్సరంలో సిద్ధార్థుడు బౌద్ధస్థూపాన్ని సందర్శించి, తాను సందర్శించిన ఊరు నడనూరు అని, బౌద్ధ స్థూపముగా వున్న కొండ పేరు వేలగిరి అని తాను వేయించిన శాసనంలో పేర్కొన్నాడు. జగ్గయ్యపేటను ప్రాచీన కాలంలో నడనూరు అని, మధ్యయుగములో బేతవోలు అని వివిధ నామములతో పిలిచేవారు. క్రీ.శ. 1765లో అమరావతి జమీందారు వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు ఈ పురాతన నగరాన్ని పునర్నిర్మాణం చేసి, తన తండ్రి జగ్గన్న పేరు మీదుగా బేతవోలుకు జగ్గయ్యపేట అను నూతన నామకరణం చేశారు. అప్పటినుంచి జగ్గయ్యపేట ప్రముఖ ఆధ్యాత్మిక, వాణిజ్య కేంద్రంగా ప్రసిద్ధి పొందింది.

నాటి నుండి వందలాది వైశ్య కుటుంబాలు జగ్గయ్యపేటలో స్థిరపడి వర్తక, వాణిజ్యాలను కొనసాగిస్తున్నారు. అలాంటి కుటుంబాలలో గోనుగుంట్లవారి వంశం ప్రముఖమైనది.

గోనుగుంట్ల వారి గోత్రం పేరు దేశట్ల.

గోనుగుంట్ల నరసింహం, మహాలక్ష్మమ్మ దంపతులకు రత్నయ్య, రామనాధం, కృష్ణమూర్తి అనే ముగ్గురు కుమారులు. మూడవ కుమారుడు కృష్ణమూర్తిగారు రాయపూడి వంశానికి చెందిన లక్ష్మీకాంతంగారిని వివాహం చేసుకున్నారు. ఆ పుణ్య దంపతులకు గోనుగుంట్ల నాగేశ్వరరావు, గోపాలకృష్ణమూర్తి, నారాయణరావు అనే ముగ్గురు కుమారులు, లక్ష్మీవిలాసం, ధనలక్ష్మీ, నాగేశ్వరి అనే ముగ్గురు కుమార్తెలు జన్మించారు.

వీరిలో జేష్ఠ కుమారుడు శ్రీ గోనుగుంట్ల నాగేశ్వరరావు గారు 1924 జులై 31న కన్యాలగ్నం, పుష్యమి నక్షత్రం ద్వితీయ పాదం, కర్కాటకరాశిలో జన్మించారు.

# ప్రజాసేవలో ప్రస్థానం

**మ**హాత్మాగాంధీ ప్రకటించిన క్విట్ ఇండియా ఉద్యమం భారతదేశమంతటా ఉధృతంగా కొనసాగుతున్న రోజులవి. 1942 ఆగస్టు 13న క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా గుంటూరు నగర ప్రజలు గాంధీ పార్కులో గొప్ప బహిరంగసభను నిర్వహించి బ్రిటీష్ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రసంగాలు, నినాదాలు చేసారు. ఊరేగింపు తీయడానికి ప్రయత్నం చేయగా, దానిని అడ్డుకునేందుకు పోలీసులు కాల్పులు జరుపగా ఇద్దరు ప్రదర్శకులు మరణించారు. ఈ ఆందోళనలో పాల్గొన్న హిందూ కళాశాల విద్యార్థులను గుర్తించి అరెస్టు చేయుటకు 14 ఆగస్టు 1942న హిందూ కళాశాలకు పోలీసులు వచ్చారు. ఆనాటి ప్రిన్సిపాల్ శ్రీ బుద్ధిరాజు రామచంద్రరావుగారు ప్రిన్సిపాల్ అనుమతి లేకుండా హిందూ కళాశాల ఆవరణలోనికి పోలీసులు రాకూడదని నిరోధించారు.

హిందూ కళాశాలలో ఆ సమయమున జరిగిన సంఘటనలు ఇంటర్ మీడియేట్ చదువుచున్న శ్రీ గోనుగుంట్ల నాగేశ్వరరావు గారి భావిజీవితంపై ఎంతో ప్రభావాన్ని చూపించాయి. అప్పటి నుండి గోనుగుంట్ల గారు గాంధేయ సిద్ధాంతాలకు ప్రభావితులై కాంగ్రెస్‌వాదిగా జీవనం ప్రారంభించారు.

ఈ సందర్భంగా కొన్ని విషయాలను ప్రస్తావించుకోవాలి. 1888 సంవత్సరంలో భారత జాతీయ కాంగ్రెస్ నాలుగవ సమావేశం అలహాబాదులో జరిగింది. ఆ సమావేశానికి ప్రముఖ అతిధిగా వచ్చిన బ్రిటీష్ పార్లమెంట్ సభ్యుడు బ్రాడ్‌లాఫ్ కాంగ్రెస్ నాయకుల లక్ష్యం ఈ విధముగా వుండవలెనని పేర్కొన్నారు. “ప్రజాహితమే పరమావధిగా నాయకులు కృషి చేయవలెను. ప్రజల కొరకు జన్మించి ప్రజల విశ్వాసమును పొంది ప్రజల కొరకు మరణించవలెను. ఈ ప్రజాసేవకు ప్రాంత సరిహద్దుగాని జాతి విచక్షణగాని ఉండరాదు” అని బ్రాడ్‌లాఫ్ పేర్కొన్నారు.

పైన పేర్కొనిన సంఘటన, సందేశములలో నిండిన దేశభక్తితో ఉత్తేజితులై

# మహనీయుల బాటలో..

**భా**రతదేశ చరిత్రలో ప్రాచీన కాలంలో గౌతమ బుద్ధుడు, ఆధునిక యుగంలో మహాత్మాగాంధీకి విశిష్ట స్థానము కలదు. గౌతమబుద్ధుడు బౌద్ధమతమును స్థాపించుట ద్వారాను, మహాత్మాగాంధీ అహింసాయుత పద్ధతి ద్వారా భారతదేశమునకు స్వాతంత్ర్యమును సముపార్జించుటలో దోహదపడటము ద్వారా ప్రపంచంలో అగ్ర నాయకుల స్థాయికి చెందియున్నారు. అటువంటి మహనీయుల కృషి భావి తరాల వారికి తెలియజేయుట కొరకు శ్రీ గోనుగుంట్ల నాగేశ్వరరావుగారు జగ్గయ్యపేట మరియు షేర్‌మహమ్మద్‌పేట గ్రామాలలో ఘనంగా ఉత్సవాలను నిర్వహించి ఆ మహాపురుషుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. గౌతమ బుద్ధుడు, మహాత్మాగాంధీ విగ్రహములతో పాటు ఆంధ్రరాష్ట్ర సిద్ధికై ప్రాణత్యాగ మొనర్చిన పొట్టి శ్రీరాములు గార్ల విగ్రహాల ప్రతిష్ఠాపనకై నాగేశ్వరరావుగారు విశేషముగా కృషి చేశారు. చారిత్రక వేకువ స్మరణీయులైన అనేక మంది మహనీయుల విగ్రహాలను ఆధునిక తరం చిరస్మరణకోసం నెలకొల్పడంలో విశేష కృషి చేసిన సంఘ సంస్కర్త, గాంధేయవాది, గ్రంథాలయోద్యమ నేత, విద్యాదాత శ్రీ గోనుగుంట్ల నాగేశ్వరరావుగారి కాంస్య విగ్రహాన్ని జగ్గయ్యపేటలో, శ్రీమతి గెంటేల శకుంతలమ్మ కళాశాల ప్రాంగణంలో నగర ప్రజలు నెలకొల్పుకుని సదా స్మరించుకోవడం ముదావహం.

## *బుద్ధ జయంతి ఉత్సవం*

గౌతమబుద్ధుడు క్రీస్తు పూర్వం 567 సంవత్సరంలో లుంబిని వనములో జన్మించాడు. రాజవంశీయుడైనను ప్రజల బాధను తొలగించుటకై అతడు ప్రవక్తగా మారి బౌద్ధమతమును స్థాపించెను. లోకంపట్ల జాలియే ఒక మహాశక్తియై అతనిచే సంసారాన్ని త్యజింపజేసి అడవులకు పరుగెత్తించింది. విశ్వమంతటను ఆవరించుకొన్న జాలితో అతడు వ్యక్తిగత జీవితంలో తండ్రిపట్లను, దారాపుత్రులపట్లను అమిత కాఠిన్యము వహించెను. ఈ అనుబంధాలను త్యజించి గౌతముడు చివరకు కరుణారస

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Gonuguntla+Nageswara+Rao](http://kinige.com/book/Gonuguntla+Nageswara+Rao)

* * *